ప్రజాశక్తి
శనివారం 15 మార్చి 2025 5
శ్రీ సత్యసాయి



పక్కాగా స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర

కలెక్టర్ టిఎస్. చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రతి మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం అధికారులందరూ సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ టిఎస్ చేతన్ ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం జిల్లా అంతట ఈ కార్యక్రమం చేపట్టాలని, ఆ వివరాలను ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో నమోదు చేయాలని తాహశీల్దార్లకు సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించాలని విక్రయాలను సైతం అరికట్టాలని అన్నారు. భూమిలో కుళ్లిపోయే వస్తువులు మాత్రమే వాడాలన్నారు. కాలుష్యంతో దెబ్బతింటున్న పర్యావరణాన్ని పరిరక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయన్నారు. ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించాలని, ప్రతి కార్యాలయంలో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, పరిశ్రమలు, ఆర్టీసీ బస్టాండ్, కాయగూరల మార్కెట్, మార్కెట్ యార్డులు, రైతు బజార్లు, దేవాలయాలు, పర్యాటక కేంద్రాలు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలు ప్రధాన కూడళ్ళలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కాలుష్యం, పర్యావరణం, పరిశుభ్రత పై ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.



నల్లగా మారిపోయిన కళింగర కాయలు

'ఉపాధి' సగమే



- సగటున 49.65 రోజులే పని
- వంద రోజులు పని పూర్తి చేసింది 17,264 కుటుంబాలే
- పది వారాలుగా పెండింగ్‌లో బిల్లులు
- నేటి నుంచి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉపాధి హామీ పథకం కింద వంద రోజులు పని కల్పించాలని లక్ష్యమున్నప్పటికీ ఇప్పటి వరకు కల్పించినది కేవలం యాభై రోజుల్లోపే ఉండటం గమనార్హం. మరోవైపు పనిచేసిన కూలీలకు పది వారాలైనా బిల్లులు పడకుండా ఉన్నాయి. వ్యవసాయ పనుల్లేని కాలంలో గ్రామాల్లో ఈ పనుల ద్వారా ఉపాధి లభిస్తుందని భావించిన వ్యవసాయ కూలీలకు పనిలేకుండా పోయింది. దీంతో వలసలే శరణ్యమవుతున్నాయి. ఇప్పటికే రాయదుర్గం, కళ్యాణదుర్గం, గుంతకల్లు ప్రాంతాల నుంచి అనేక మంది ఉపాధి కోసం వలసలు వెళ్లారు.



యాభై రోజులే పని

జిల్లాలో 3.13 లక్షల జాబ్‌కార్డులున్నాయి. 5.79 లక్షల మంది కూలీలు నమోదయి ఉన్నారు. 4.64 లక్షల మంది వ్యవసాయ కూలీలు పనికొచ్చేవారున్నాయి. ఇంత సంఖ్యలో పనికొచ్చేవారున్నా పని కల్పించడం లేదన్న విమర్శలున్నాయి. దీని మూలంగా ఈ ఏడాది అంటే 2024–25 ఆర్థిక సంవత్సరం ఇక రెండు వారాల్లో ముగియనుంది. ఇంత వరకు చూస్తే సగటున 49.65 రోజులే పని కల్పించారు. అంటే వంద రోజులు పని కల్పించాలన్నది లక్ష్యమైతే సగటున పని కల్పించినది 49.65 రోజులు మాత్రమే. ఇక వంద రోజులు పని పూర్తి చేసిన కుటుంబాలు చూస్తే కేవలం 17264 కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. ఐదు శాతంలోపే వంద రోజులు పని పూర్తి చేసుకున్న వారు ఉన్నారు.

పది వారాలైనా అందని బిల్లులు

ఇక పనిచేసిన దానికి బిల్లులు రావడంలోనూ తీరని జాప్యం నెలకొంది. చాలా చోట్ల ఎనిమిది నుంచి పది వారాలైనా బిల్లులు రావడం లేదు. ఈ రకంగా బిల్లులు పెండింగు ఉన్న వరకు చూస్తే పెద్దపప్పూరు, వజ్రకరూరు, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో ఎనిమిది నుంచి పది వారాలైన బిల్లులు అందక కూలి డబ్బుల కోసం ఎదురు చూసే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఇక పనిచేసే ప్రాంతాల్లో నీడ, నీళ్ల వంటివి కూడా లేవు. ఎండ వేడిమి పెరుగుతున్న తరుణంలో వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది. అంతేకాకుండా గునపం పదును చేసుకోవడానికి గతంలో బిల్లులు ఇచ్చేవారు. ఈసారి అవి కూడా అందటం లేదని వ్యవసాయ కూలీలు వాపోతున్నారు.

నేటి నుంచి స్కూటర్ ర్యాలీ :


ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి

వ్యవసాయ కూలీల సమస్యలను తెలుసుకునేందుకు జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి స్కూటర్ ర్యాలీలను నిర్వహించనున్నట్టు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి తెలిపారు. ఆయా మండాల వారీగా ఇది జరుగుతుందన్నారు. ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు ఈ ర్యాలీలు జరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం ఈనెల 22వ తేదీ వరకు సచివాలయాల్లో సమస్యలపై వినతిపత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. అక్కడికి ప్రభుత్వంలో స్పందనలేకపోతే జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించాలని తలపెట్టినట్టు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కూలీలకు పనులు కల్పించాలని, పెండింగు బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పని ప్రాంతాల్లో నీడ, నీరు సౌకర్యంతో పాటు వేసవి అలవెన్సు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టపాసుల గోడౌన్‌లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - నల్లచెరువు

స్థానిక దామోదర్ గ్రౌండ్ నెట్ ఫ్యాక్టరీలో అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులు గోడౌన్ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దాదాపు 5 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని తెలుస్తోంది. ఈ గోడౌన్ పక్కనే నిల్వ ఉంచిన ఎనిమిది టన్నుల కర్బూజా ఈ ప్రమాదంలో కాలిపోయింది. దీంతో తనకు రూ. 1.50 లక్షలు నష్టం వాటిల్లిందని చెరువు వాండ్లపల్లికి చెందిన చెందిన రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాను ప్రతిరోజు బండి పైన కాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నానన్నారు. శుక్రవారం తమిళనాడు నుంచి ఎనిమిదిన్నర టన్నుల కర్బూజా రూ.1.50 లక్షలకు కొనుగోలు చేసి గోడౌన్‌లో నిల్వ ఉంచానన్నారు. టపాసుల గోడౌనపక్కనే కర్బూజా కాయలు ఉండడంతో ప్రమాదంలో మొత్తం కాయలు కాలిపోయాయన్నారు. సంబంధిత అధికారులు జరిగిన నష్టానికి పరిహారం ఇప్పించాలని కర్బూజా వ్యాపారి రామాంజనేయులు కోరుతున్నాడు.



గోడౌన్‌లో చెలరేగిన మంటలు

వైసిపి కార్యకర్తలపై టీడీపీ దాడి అమానుషం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం బాలంపల్లి పంచాయతీ జంగాలపల్లికి చెందిన వైసిపి నాయకులు మాజీ వాలంటీర్ అశ్వర్థ, దేవేగౌడ లపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు సాయికుమార్, శ్రీనివాసులు, గోవిందప్ప చేసిన దాడి అమానుషమని వైసిపి నాయకులు గుడ్డంపల్లి వేణు రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో ముందస్తు ప్రణాళిక ప్రకారం ద్విచక్ర వాహనంపై వస్తున్న అశ్వత్థ, దేవేగౌడ లపై ఇనుప రాడ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి హత్యాయత్నం చేశారని ఆరోపించారు. తీవ్ర గాయాలకు గురైన బాధితులను స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారన్నారు. మెరుగైన చికిత్స కోసం బెంగళూరు తరలించామన్నారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను గుడ్డంపల్లి వేణు రెడ్డి తో పాటు నాయకులు శివ, కృష్ణమూర్తి, అసిపుల్లా తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా వేణు రెడ్డి మాట్లాడుతూ కూటమి గూండాలు చేస్తున్న దౌర్జన్యాలను ప్రజలందరూ గమనిస్తున్నారని, వీరి అరాచకాలను ఆపకపోతే ప్రజలే తిరగబడి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వారి పార్టీ నాయకులను అదుపు చేయాలని, లేనిపక్షంలో ప్రజా ఆందోళన తప్పదని హెచ్చరించారు. శాంతికి చిహ్నంగా ఉంటున్న హిందూపురంలో ఇలాంటి దాడులకు పాల్పడడం సరైన పద్ధతి కాదన్నారు. హిందూపురంలో పీఏల ఆధిపత్యం కారణంగా వైసిపి కార్యకర్తలపై దాడులు పెరిగిపోతున్నాయని ఆరోపించారు.



గాయపడిన వారిని పరామర్శిస్తున్న వేణు రెడ్డి

అగ్నికి ఆహుతి అవుతున్న అడవులు



నంబులపూలకుంట మండలంలో అటవీప్రాంతానికి నిప్పు పెట్టిన దృశ్యం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలోని అడవులు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. వేసవి కాలంలో అడవులు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు అకాతాయిలు అడవులకు నిప్పు పెట్టుటుండటంతో అటవీసంపద ఆహుతి అవుతోంది. అవగాహన కల్పించాల్సిన అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం వహిస్తూ గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు అడవులకు చిన్నచిన్న గుట్టలకు నిప్పు పెట్టడం వల్ల దగ్గర్లో ఉన్న పంటలు, గడ్డివాములు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. మండల పరిధిలోని బందారుచెట్లపల్లి వద్ద బుధవారం గుర్తు తెలియని గుట్టలకు నిప్పు పెట్టారు. దీంతో సమీపంలో పంటలు సాగు చేసుకుంటున్న రైతులు తమ పంటకు మంటలు వ్యాపిస్తాయన్న ఆందోళనతో మంటలు ఆర్పడానికి నానాపాట్లు పడుతున్నారు. గురువారం ఉదయం 9 గంటల సమయంలోనే మర్రికోమదిన్నె గ్రామ సమీపంలో గుట్టకు గుర్తుతెలియని అగంతకులు నిప్పు పెట్టడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసి పడ్డాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అడవులు అగ్నికి ఆహుతి కాకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అరటిచెట్లు దగ్ధం

అగళి : మండలంలోని పి బ్యాడిగెరాలో ఓ రైతుకు సాగు చేసిన అరటి, వక్క, టెంకాయ చెట్లకు నిప్పు అంటుకుంది. గ్రామానికి చెందిన బడగొడ్డి మల్లప్ప తన పొలంలోని బోరుబావి వేసుకొని అరటి, వక్క, టెంకాయచెట్లను సాగు చేస్తున్నాడు. 550 వక్క చెట్లు, 75 టెంకాయ చెట్లు, 200 అరటి మొక్కలు వేసుకున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రైతు పొలానికి సమీపంలో ఉన్న బీడుభూమిలో ఉన్న గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. ఈ మంటలు మల్లప్ప పొలానికి వ్యాపించాయి. పొలంలో ఉన్న 200 వక్క చెట్లు, 35 టెంకాయ చెట్లు, 55 అరటి మొక్కలు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న బాధిత రైతుల పొలానికి వచ్చి జరిగిన నష్టాన్ని చూసి భోరున విలపించాడు. మంటల్లో కాలి బూడిద అయిపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం అందించాలని బాధిత రైతుతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.



అగళిలో కాలిపోయిన వక్కచెట్లు

నేడు డాక్టర్ సాయి కాళేశ్వర్ వర్ధంతి

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

పేదల అభ్యున్నతే ధ్యేయంగా డాక్టర్ సాయి కాళేశ్వర్ షిర్డీ సాయి గ్లోబల్ ట్రస్ట్‌ను స్థాపించి, తద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన 13వ వర్ధంతి వేడుకలను శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించను న్నారు. స్థానిక శివసాయి మందిరం వద్ద ఉన్న కాళేశ్వర్ సమాధిని ప్రత్యేకంగా అలంకరించారు. సమాధి వద్ద ముందుగా కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నవ్యశ్రీ ఉచిత కంటి ఆసుపత్రిని నెలకొల్పి ప్రతిరోజూ పేదలకు కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా ఆపరేషన్లు సైతం చేయిస్తున్నారు. వర్ధంతి సందర్భంగా ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప సూచించారు.



మతిస్థిమితం లేని మహిళ బంధువుల చెంతకు



మతిస్థిమితం లేని మహిళను అప్పగిస్తున్న ఎస్ఐ శ్రీధర్

ప్రజాశక్తి-హిందూపురం

ఓ మతిస్థిమితం లేని మహిళ ను హిందూపురం పోలీసులు కాపాడి బంధువుల ఆచూకీ గుర్తించి వారి చెంతకు చేర్చారు. ఇందుకోసం సమయస్ఫూర్తితో వ్యవహరించిన పోలీసులను శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి. రత్న అభినందించారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ కు చెందిన పూజిత మతి స్థిమితం లేక ఇంటి నుండి వచ్చి భువనేశ్వర్ ట్రైన్ ఎక్కి బెంగళూరు వైపు వచ్చింది. అయితే ట్రైన్‌లో కంపార్ట్ మెంట్ పక్కనే ఉన్న బెంగళూరుకు చెందిన వారి సెల్ ఫోన్ తీసుకున్న మహిళ వారి బంధువులతో ఫోన్ లో మాట్లాడింది. అనంతరం ఆ మహిళ భర్త తిరిగి అదే నంబరుకు ఫోన్ చేయగా పూజిత హిందూపూర్ రైల్వే స్టేషన్ లో దిగి వెళ్లిపోయిందని వారు తెలిపారు. దీంతో వెంటనే పూజిత భర్త సుమన్ రాయ్ విషయాన్ని వెస్ట్ బెంగాల్ ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న ద్వారా సమాచారాన్ని చేరవేశారు. వెంటనే స్పందించిన జిల్లా పోలీసులు రంగంలోకి దిగాయి. డీఎస్పీ కె.వి మహేష్ నేతృత్వంలో టూ టౌన్ సిఐ కరీం, వన్ టౌన్ ఎస్ఐ శ్రీధర్ తన సిబ్బందితో మహిళ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. హిందూపురం రైల్వే ట్రాక్ సమీపంలో ఓ మహిళ ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఆ ప్రాంతానికి పోలీసులు చేరుకొని మహిళను పోలీస్ స్టేషన్ కి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని భర్త సుమన్ రాయికి ఫోన్ ద్వారా తెలియజేశారు. అక్కడి నుండి వచ్చిన ఆయనకు పూజితను అప్పగించారు. జిల్లా ఎస్పీ వి. రత్న తీసుకున్న చొరవ హిందూపురం టూ టౌన్ సిఐ కరీం, ఎస్ఐ శ్రీధర్ ,పోలీస్ సిబ్బంది తమ భార్యని ప్రాణాలతో సురక్షితంగా అప్పజెప్పినందుకు పూజితన భర్త కృతజ్ఞతలు తెలిపారు. మతిస్థిమితం లేని మహిళను సురక్షితంగా కాపాడి కుటుంబ సభ్యులకు అప్పజెప్పిన హిందూపురం పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు.

నీటి సరఫరాలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ రమేష్ కుమార్


ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా నీటి సరఫరాలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సంగం శ్రీనివాసులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్‌తో కలిసి నీటి సరఫరా విభాగ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ చాలామంది సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీంతో పాటు కొంతమంది డబ్బులు ఇస్తే ఇచ్చిన వారి ప్రాంతానికి ఎక్కువ సమయం నీటిని వదులుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ఈ రెండింటి పైన విచారణ చేస్తున్నామని, నిజమని తేలిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేసవిలో ఎక్కడా నీటి ఎత్తడి తలెత్తకుండా అవసరమైన చర్యలను ముందస్తుగానే తీసుకోవాలన్నారు. నీటి సరఫరా విషయంలో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై వేటు తప్పదన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే వాటర్ మెన్ నుంచి కమిషనర్ స్థాయి వరకు ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. పైప్ లైన్ లు ఎక్కడ లీకేజీ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా ప్రాంతాల వాటర్ మెన్‌లపై ఉందన్నారు. లీకేజీలు అయినా వెంటనే సంబంధిత ఫిట్టర్, అమ్యూనిటీ సెక్రటరీల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే అంచనాలను సిద్ధం చేయించి, మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. పట్టణంలో ఎవరి వార్డులో నీటి సమస్య వస్తుందో ఆ వార్డులో పని చేసే సిబ్బంది పైన చర్యలు తీసుకుంటామన్నారు. నిర్లక్ష్యం వీడి విధులు నిర్వహించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ శోభన్ రెడ్డి, ఏఈ శంకర్, టెక్నికల్ అధికారి బండి ఆనంద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీవారు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ఆలయంలో ఉదయం నిత్యపూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన బ్రహ్మగరుడ సేవకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. సాయంత్రం సమయంలో గరుడదండం ప్రతిష్టించి, శ్రీవారిని తిరువీధుల్లో ఊరేగించారు. కొక్కంటి పాల్లెగాళ్లు శనివారం నుంచి శ్రీవారి సేవలో భాగస్వాములై దివిటి మోస్తారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా కదిరి పౌర్ణమికి ఖాద్రిశుని దర్శనానికి భక్తులు పోటెత్తారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా నేడు శనివారం శేష వాహనం పై శ్రీవారు దర్శన భాగ్యం కల్పించనున్నారు.



ఎల్ -4 కాలనీలో తాగునీటి సమస్య

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం మున్సిపల్ పరిధిలోని ఎల్ – 4 కాలనీలో తాగునీటి సమస్య నెలకొంది. వారం పది రోజుల ఒకసారి నీటిని వదులుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ సందర్భంగా వార్డుకు చెందిన సిపిఎం నాయకులు వి. వెంకట స్వామి తదితరులు మాట్లాడుతూ అర్ధరాత్రి పూట ఒంటిగంట, రెండు గంటలకు నీటిని కొద్దిసేపు మాత్రమే వదులుతున్నారని అన్నారు. కాలనీ ఏర్పడి 16 సంవత్సరాలు అయినా కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. వార్డులో వీధి దీపాలు కూడా సరిగా వెలగడం లేదన్నారు. మున్సిపల్ కమిషనర్ ఒకసారి వార్డు పర్యటన చేస్తే సమస్య తెలుస్తుందన్నారు. సంబందిత అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

'విశాఖ ఉక్కు' ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను ఆపాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సర్కిల్లో నిరసన తెలిపి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. శ్రామిక మహిళా సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా కన్వీనర్ దిల్షాద్, సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో కాంట్రాక్టర్ల అప్పులు తీర్చడానికి మాత్రమే బడ్జెట్ కేటాయించిందని, కార్మికుల వేతనాలు, ఇనుము ముడి సరుకు కొనుగోలుకు ఉపయోగించరాదని కేంద్ర మంత్రి, సహాయ మంత్రులు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. సిఎం చంద్రబాబు విశాఖ ఉక్కును కాపాడడం కోసం చర్యలు చేపట్టకుండా, ఆర్సెల్ లాల్ మిట్టల్‌కు పరిశ్రమకు సొంత గనులు కావాలని కేంద్రాన్ని కోరడం దుర్మార్గమన్నారు. జిందాల్‌కు సొంత గనులు కేటాయించాలని, కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, ముడి సరుకు కొనుగోలుకు బడ్జెట్లో కేటాయించి విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్‌హెచ్.బాషా, కో కన్వీనర్ టి.అయుబ్‌ఖాన్, ఎల్.ఆదినారాయణ, ఎస్.హైదర్ వలి, ముకుంద, కేశవ, ఈశ్వరయ్య, అంగన్వాడీ వర్కర్లు దీన, పోతక్క, సునీత, ఆయాలు చౌడమ్మ, జయమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కుపై శీతకన్ను వేశాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జిఎల్.నరసింహులు విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఇన్నర్ రింగ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రయివేటీకరణ చేయబోమని ఓ పక్క చెబుతూనే మరో పక్క బడ్జెట్లో కేటాయించిన నిధులను అప్పులకు మాత్రమే చెల్లించాలని చెప్పడం మోసం చేయడమే అన్నారు. రెండేళ్లుగా కార్మికులు పోరాటం చేస్తున్నా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటీకరణ చేయమని ప్రభుత్వాలు ప్రకటించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, పట్టణ నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, ముస్తాక్, బాబ్‌జాన్, శివప్రసాద్, ఫక్రుద్దీన్, ఫాజిల్, రఫిక్, గంగప్ప, తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి ఇస్తున్న సిఐటియు నాయకులు

వంక కాలువను కాపాడాలని నేడు ఆందోళన

ప్రజాశక్తి-పెనుకొండ

వంక కాలువ అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న ఆధ్వర్యంలో శనివారం నాయకులు వంక కాలువను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని మరువపల్లికి చెందిన 50 మంది రైతుల పొలాలు జాతీయ రహదారికి పక్కనే ఉన్నాయన్నారు. వారి పొలాల పక్కన వంక కాలువ ఉందన్నారు. ఆ కాలువ మీదుగా రైతులు, వ్యవసాయ కూలీలు రాకపోకలు సాగిస్తున్నా రన్నారు. అయితే రైతు చింతల సంజీవరాయుడు రాజకీయ, ఆర్థిక పలుకుబడితో వంక కాలువను ఆక్రమించి చుట్టుపక్కల రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ పరిస్థితుల్లో రైతులు, వ్యవసాయ కూలీలు ఏకమై శనివారం తహశీల్దార్ కార్యాలయం ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రెవెన్యూ రికార్డుల మేరకు వంక కాలువలను రక్షించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వెంకటరాముడు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తిప్పన్న, వడ్డి ఆంజనేయులు, అక్కులప్ప, రామాంజనప్ప, మారుతి, అప్పన్న, నారాయణప్ప, మిఠాయప్ప, తిప్పన్న, చిన్నప్ప, చంద్రశేఖర్, పరమేష్, శంకర్, ప్రసాద్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమించిన కాలువను చూపుతున్న వ్యకాసం నాయకులు, రైతులు

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-కదిరి టౌన్

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని డిఎంహెచ్ఒ ఫైరోజ్‌బేగం వైద్యులను హెచ్చరించారు. ఆమె శుక్రవారం పట్టణంలోని శిల్ప నర్సింగ్ హోంతో పాటు మూర్తిపల్లి, నిజాంవలి కాలనీల్లోని అర్బన్ హెల్త్ సెంటర్లను సందర్శించారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు, లేబర్ వార్డులను తనిఖీ చేశారు. హాస్పిటల్‌లో అందుతున్న సేవలపై రోగులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రయివేట్ హాస్పిటల్, శిల్ప నర్సింగ్ హోంలను తనిఖీ చేసి, సాధారణ డెలివరీలు చేయాలని, అవసరమైతే తప్ప సిజేరియన్ కాన్పులు చేయరాదని వైద్యులను ఆదేశించారు. అనంతరం స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసి, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే, కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి ప్రయివేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒఆర్ఎస్ కార్నర్, తాగునీటి వసతులు కల్పించాలని సూచించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట డిప్యూటీ డిఎంహెచ్ఒ నాగేంద్రనాయక్, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎండి హుస్సేన్, సిబ్బంది ఉన్నారు.

పార్టీకి రమేష్‌కు సంబంధం లేదు : సిపిఎం

ప్రజాశక్తి-పెనుకొండ

సిపిఎంకు రమేష్‌కు ఎలాంటి సంబంధం లేదని, అతడిపై పార్టీ చాలా రోజుల క్రితమే క్రమశిక్షణ చర్యలు తీసుకుందని, అతడి పార్టీ సభ్యత్వం సస్పెన్షన్‌లో ఉందని సిపిఎం నాయకులు హరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత గురువారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన కేసులో రమేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. కొన్ని పత్రికలు రమేష్‌ను సిపిఎం నాయకుడు అని రాయడాన్ని హరి తీవ్రంగా ఖండించారు. అతడికి సిపిఎంకు ఎలాంటి సంబంధం లేదని, పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని స్పష్టం చేశారు. అతను కార్మిక సంఘంలో పని చేస్తున్నార న్నారు.

ప్లంబర్స్ యూనియన్‌లో భగ్గుమన్న విభేదాలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం ప్లంబర్స్ యూనియన్ లో విభేదాలు భగ్గుమన్నాయి. యూనియన్ లోని ముగ్గురు వ్యక్తులు అక్రమాలకు పాల్పడ్డారని మిగిలిన వారు ఆరోపించారు. గోవిందరాజులు, బాషా, ఆ భూమి యజ మాని నారాయణస్వామి శుక్రవారం విలేకరు ల సమావేశంలో మాట్లాడారు. యూనియన్ నాయకులమని చెప్పుకుం టున్న సురేంద్ర, రాజు, లతీఫ్ తోటి ప్లంబర్స్‌ను ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. యూనియన్ సభ్యులకు కాకుండా డబ్బులు తీసుకుని బయటి వ్యక్తులకు ప్లాట్లు విక్రయించి సొమ్ము చేసుకున్నారని విమర్శించారు. వారిపై ఇప్పటికే యూనియన్ తరపున కోర్టుకెళ్లామని తెలిపారు. మీరు నిజాయితీ పరులైతే పట్టాల పంపిణీపై విచారణకు సిద్ధమా అని సవాల్ చేశారు. 76 ప్లాట్లు మంజూరు చేస్తే అందులో నిజమైన వారు 20 మందికి మించి లేరన్నారు. బినామీ పేర్లతో దోచుకున్న పట్టాలను వెంటనే వెనక్కి ఇవ్వాలని లేదంటే జరగబోయే పరిణామాలను ఎదర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, గోవిందరాజు, లక్ష్మీనారాయణ, రామక్రిష్ణ, నాగేంద్ర, సుబ్బయ్య, చిన్నా, నాగరాజు, ఆంజనేయులు, మసూద్, తాజ్, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

17న 'చలో విజయవాడ'

ప్రజాశక్తి-నల్లమాడ

గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలపై ఈ నెల 17వ తేదీ చేపట్టనున్న 'చలో విజయవాడ' కార్యక్రమంలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి గోవిందు పిలుపునిచ్చారు. నల్లమాడలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, యూనిఫారం, చెప్పులు, సబ్బులు, నూనె, టవల్స్, పనిముట్లు అందించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా అక్రమంగా తొలగించిన వర్కర్లను విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, కార్మికులు నరసింహులు, గంగాద్రి, శ్రీరాములు, నాగలక్ష్మి, గాయత్రి, గంగాదేవి, నారాయణమ్మ పాల్గొన్నారు.

నేడు 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండల వ్యాప్తంగా శనివారం అన్ని గ్రామ పంచాయతీలు, సచివాలయాల పరిధిలో అధికారు లందరూ 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంపై అవగాహన సదస్సులు చేపట్టాలని ఎంపిడిఒ సాయి మనోహర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాల్లో ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, నివారించడం, వాటి స్థానంలో ఆరోగ్యానికి హాని చేయని వస్తువులు వాడ టం వంటి పనులను చేయాలని సూచించారు.

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపాలిటీ పరిధిలో శనివారం 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం చేపడుతున్నట్లు కమిషనర్ ప్రహ్లాద ఓ ప్రకటనలో తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్లాస్టిక్ విక్రయాలు అరికట్టడం, వాడకంపై ప్రజల్లో అవగాహన కల్పించడంపై ర్యాలీ, ప్రతిజ్ఞ చేయించడం, తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. దుకాణాల్లో ప్లాస్టిక్ అమ్మకాలు చేస్తే జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి పాల్గొంటారని, కౌన్సిలర్లు, అధికారులు అందరూ పాల్గొనాలని కమిషనర్ కోరారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S.No. 555/2023

కోట నజిరుద్దిన్ అహమ్మద్, S/o షహబుద్దిన్ అహమ్మద్, వయస్సు 36 సం॥రాలు, R/o డోర్ నెం.19/284, అమ్మవారిశాల వీధి, ప్రొద్దుటూరు-516360, కడప జిల్లా.

...వాది

Vs

షేక్ కొత్తకోట మదీహ, W/o నజిరుద్దిన్ అహమ్మద్, వయస్సు 30 సం॥రాలు, R/at D.No.1-1113-1, బిహైండ్ కె.కె.ట్రేడర్స్, బైపాస్ రోడ్డు, కదిరి, సత్యసాయి జిల్లా.

...ప్రతివాది

నోటీసు

పై నెంబరు దావాను పై పిటిషనరు, రెస్పాండెంట్ అయిన నీ పైనా నీవు పిటిషనరుతో వచ్చి సంసారం చేయుటకు పై పిటిషన్‌ను దాఖలు చేసి ఉన్నాడు. అట్టి పై పిటిషన్‌లో నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యడల పై కోర్టు యందు 15.04.2025వతేది ఉదయం 10.30లకు హాజరయ్యి తెలుపుకోవలయును. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

REDDY MARUTHI PRASAD
B.Com., B.L.,
Advocate,
PRODDATUR. Cell: 9885267851.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

పుట్టపర్తి రూరల్ : మండలంలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ సురేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిసి, బైపిసి, ఎంఈసి, సిఇసి, గ్రూపులు ఉన్నాయని, బోధన ఆంగ్ల మాధ్యమంలో ఉంటుం దని తెలిపారు. ఈ నెల 17 నుంచి మే 22వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు అన్నా రు. దరఖాస్తు రుసుము ఓసి, బీసీ, ఈడబ్ల్యుఎస్‌కు రూ. 200, ఎస్సీ, ఎస్టీలకు రూ. 150 అన్నారు. ప్రభుత్వ గుర్తింపు కలిగిన పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు.

రేపు 'మహిళా శిరోమణి' పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

మహిళా సాధికారతలో భాగంగా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 25 మంది మహిళలను ఎంపిక చేసి ఈ నెల 16వ తేదీ పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో 'మహిళా శిరోమణి' పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు జాబిలి చాంద్‌బాషా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో బ్రోచర్‌ను విడుదల చేశారు. జాబిలి చాంద్ బాషా మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పౌర సన్మాన గ్రహీత మంత్రి సవిత, ఎంపి బికె.పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎస్పీ వి.రత్న, ఆర్‌డిఒలు సువర్ణ, టి.ఆనంద్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర రావు హాజరవుతారన్నారు. కార్యక్రమం నిర్వాహకులుగా త్రిపుర రిసార్ట్ అధినేత, సామాజిక సేవకులు డాక్టర్ కె.గోపినాథ్, బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపకులు శివరామక్రిష్ణ, ఎంక్యాప గ్లోబల్ ట్రస్ట్ అధినేత కలీముల్లా, ఘనగిరి లలిత కలాపరిషత్ అధ్యక్షులు మాధవ నాయుడు, తదితరులు భాగస్వామ్యం వహిస్తున్నారని తెలిపారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చాంద్‌బాషా, తదితరులు

కదిరి పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి-మడకశిర

కదిరి పౌర్ణమి సందర్భంగా మండలంలోని నీలకంఠాపురం దేవస్థానంలో శుక్రవారం ఉదయం శ్రీలక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో వ్రతం నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఉత్సవమూర్తిని మేళతాళాలతో ఆలయ మాడవీధుల్లో ఊరేగిం చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ రఘువీరారెడ్డి దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా హోలీ సంబరాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ప్రశాంతి నిలయంలో శుక్రవారం హోలీ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేశ విదేశాలకు చెందిన భక్తులు భారీగా తరలి రావడంతో పురవీధులు కిటకిటలాడాయి. సత్యసాయి నామస్మరణతో ప్రశాంతి నిలయం మార్మోగింది. హోలీ సందర్భంగా సత్యసాయి మహాసమాధిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన సత్యసాయి భక్తులు సాయి కుల్వంత్ సభా మందిరంలో సామూహిక భగవద్గీత పారాయణం చేసి గీత విశిష్టతను తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సత్యసాయి భక్తులు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలతో చూపరులను మంత్రముగ్ధులను చేశారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలోని ఎన్‌డిఎ కార్యాలయం వద్ద ఇన్‌ఛార్జి హరీష్‌బాబు ఆధ్వర్యంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజలు, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని పరస్పరం రంగులు చల్లుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. హరీష్‌బాబు ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ అంటే సామరస్యాన్ని, స్నేహభావాన్ని పెంపొందించే ప్రత్యేకమైన సంబరమని వారు అభిప్రాయపడ్డారు. ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించిన వేడుకలు ప్రజలను ఆనందోత్సాహాల్లో ముంచెత్తాయి. అలాగే నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తన కార్యాలయంలో అభిమానులు, ప్రజలతో కలిసి హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పరిటాల శ్రీరామ్ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

బత్తలపల్లి : హోలీ పండుగను మండలంలో ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. గ్రామాల్లో చిన్నా, పెద్ద భేదం లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనంద డోలికల్లో మునిగితేలారు.

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా హోలీ పండుగ, కదిరి పౌర్ణమిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక పాత ఆంధ్రబ్యాంకు వెనుక నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు. ఒకరికొకరు రంగులు వేసుకొని ఆనందోత్సాహాలతో పండగ జరుపుకున్నారు.

గాండ్లపెంట : హోలీ పండగ సందర్భంగా మండలంలోని గరుగు తండా, సిఎం తండా, నల్లగుట్టతండా, తుమ్మల బయలు పెద్దతండా, గాజుల వారిపల్లి పెద్దతండా, తదితర గిరిజన తండాలు, మరియమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తండా వాసులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. గిరిజన తండాల్లో మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

నంబులపూలకుంట : మండలంలోని సున్నపుగుట్టతండా, ఎన్జీ తండా, తదితర గిరిజన గ్రామాల్లో హోలీ పండగను ఘనంగా నిర్వహించినట్లు గిరిజన తండా వాసులు తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి, సంప్రదాయ దుస్తులు ధరించి చిన్నా, పెద్ద తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు.



హోలీ సందర్భంగా సాయి కుల్వంత్ హాలులో ప్రత్యేక కార్యక్రమాలు

నేడు, రేపు మంత్రి పర్యటన

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ రెండు రోజుల పర్యటనను విజయవంతం చేయా లని బిజెపి మండల కన్వీనర్ ఆకులేటి భాస్కర్, మాజీ కన్వీనర్ ఆకులేటి వీరనారప్ప పిలుపునిచ్చారు. వారు శుక్రవారం బత్తలపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ మంత్రి శనివారం బత్తలపల్లిలో బిసి హాస్టల్ భవన ప్రారంభోత్సవం, ఆదివారం బత్తలపల్లిలో విద్యుత్ ఎఈఈ భవన ప్రారంభోత్సవం, మధ్యాహ్నం మండలంలోని అప్రాచెరువు గ్రామంలో 24/7 పవర్ సప్లై అప్డేడేషన్ కార్యక్రమంలో పాల్గొంటార న్నారు. మంత్రి పర్యటనలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హంద్రీనీవా సమస్యలపై మంత్రిని కలుస్తాం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

హంద్రీనీవా కాలువ సమస్యలపై మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలుస్తామని ఎపి రైతు సంఘం నాయకులు తెలిపారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేసేందుకు మంత్రి సత్యకుమార్ హాజరవనున్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో శుక్రవారం ముదిగుబ్బలో వారు మాట్లాడుతూ హంద్రీనీవా కాలువలను వెడల్పు చేసి లైనింగ్ పనులను చేయాలని కోరతామన్నారు. అలాగే జిల్లాలోని చెరువులన్నింటికీ హంద్రీనీవా ద్వారా నీరందించాలని, కాలువల నిర్వహణను ప్రయివేట్ ఏజెన్సీలకు ఇచ్చే ఆలోచన విరమించుకోవాలని విన్నవిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేశు, ముదిగుబ్బ రైతు సంఘం కార్యదర్శి పూతలయ్య, రైతులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు కార్ల్ మార్క్స్ స్ఫూర్తి

ప్రజాశక్తి-కదిరి టౌన్

కమ్యూనిస్టు ఉద్యమాలకు కార్ల్ మార్క్స్ స్ఫూర్తిదాయకమని సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్.నరసింహులు తెలిపారు. మాస్ మహనీయుడు, కమ్యూనిస్టు సిద్ధాంత కర్త కార్ల్ మార్క్స్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నరసింహులు మాట్లాడుతూ పీడిత, తాడిత కష్టజీవుల విముక్తి కోసం సిద్ధాంతాన్ని అందించిన మహనీ యుడు కార్ల్ మార్క్స్ అన్నారు. ప్రపంచ కార్మికులారా ఏకం కండి, పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్పా అనే గొప్ప నినాదాన్ని అందించార న్నారు. అదనపు విలువ సిద్ధాంతం ద్వారా దోపిడీ క్రమాన్ని వివరించిన గొప్ప మేధావి అన్నారు. ఆయన చూపిన సైద్ధాంతిక బాటలో పోరాడటమే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో నాయకు లు ముస్తాక్, రామ్మోహన్, రఫీ, సుధాకర్‌రెడ్డి, ఉదయ్, ఆంజనేయులు, ఫాజిల్, తాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



కార్ల్ మార్క్స్ చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన ఉంటే మోసపోయే అవకాశం ఉండదని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం.శ్రీలత సూచించారు. అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేస్తూ అందులో వినియోగదారుల హక్కుల గురించి పేర్కొన్నారు. వినియోగదారుల్లో చైతన్యం వస్తేనే వినియోగదారుల రక్షణ చట్టం లక్ష్యం నెరవేరుతుందని వివరించారు. నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక వస్తువు కొనుగోలు చేయడం, వాటి సేవలను వినియోగించుకోవడం సహజం అన్నారు. నాణ్యత లేని ఉత్పత్తులు, తప్పుడు ప్రకటనలు, అధిక ధరలు, సరైన సేవలు అందకపోతే వినియోగదారుల రక్షణ చట్టం ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సురక్షితమైన ఉత్పత్తులు, నాణ్యమైన ధరకు వస్తువులు పొందే హక్కు, తప్పుడు ప్రకటనలు, మోసాల నుంచి రక్షణ హక్కు, నష్టం జరిగితే పరిహారం పొందే హక్కు ప్రజలకు ఉందన్నారు. ఆన్‌లైన్ సేవలు కూడా ఈ చట్ట పరిధిలో ఉంటాయన్నారు. తప్పుడు ప్రకటనలపై కూడా చర్యలు తీసుకోవచ్చన్నారు. రూ. కోటి లోపు మోసపోతే జిల్లా కమిషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని, రూ. కోటి నుంచి రూ. 10 కోట్ల లోపు కేసులైతే రాష్ట్ర కమిషన్, రూ. 10 కోట్లకు పైబడి కేసులు జాతీయ కమిషన్ ఎదుట కేసు దాఖలు చేయవచ్చన్నారు. నాణ్యత లేని ఉత్పత్తులపై తయారీదారులు, సేవదారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రెండేళ్ల లోపు కమిషన్ ఎదుట ఫిర్యాదు దాఖలు చేయవచ్చు అన్నారు.

'పది' విద్యార్థులను అన్ని బస్సుల్లో అనుమతించాలి

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఈ నెల 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లడానికి అన్ని ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పుట్టపర్తిలో జిల్లా రవాణా శాఖ అధికారి మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పవన్ మాట్లాడుతూ పల్లె వెలుగు, ఆర్డినరీ బస్సుల్లో మాత్రమే విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని డిపిటిఒ తెలిపారన్నారు. ఈ నిర్ణయం ఏమాత్రం సమంజసం కాదన్నారు. కొన్ని గ్రామాలకు పల్లె వెలుగు బస్సు ఒక్కోసారి అందుబాటులో ఉండవన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు అన్ని బస్సుల్లో ప్రయాణించేలా ఆర్టీసీ జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం తరపున కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు. విద్యార్థులు ఏ బస్సు ఎక్కినా పరీక్ష కేంద్రాలకు చేర్చాలని తెలిపారు.



అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పేదల ఇళ్ల నిర్మాణానికి అదనపు నిధులు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలో గృహ నిర్మాణం ప్రారంభించి ఇప్పటికీ పూర్తికాని పేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా నిధులు మంజూరు చేస్తుందని ఎంపిడిఒ సాయిమనోహర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ఇళ్లకు ఎస్సీ, బిసి లబ్ధిదారులకు రూ. 50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ. 75వేల చొప్పున అదనంగా మంజూరు చేస్తోందన్నారు. రూరల్ పరిధిలో మొత్తం 367 మంది లబ్ధిదారులు ఉండగా ఎస్సీ 76, ఎస్టీలు 24, బిసిలు 267 మంది లబ్ధిదారులుగా గుర్తించామన్నారు. ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకూ గృహ నిర్మాణ శాఖ, సచివాలయ ఉద్యోగులు, ఇంజినీరింగ్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిశీలించి అర్హులైన లబ్ధిదారుల ఇంటి ఫొటోలు తీసి, నిర్మాణ స్థితిని నమోదు చేస్తారని తెలిపారు. లబ్ధిదారులు కులం, ఆదాయ సర్టిఫికెట్ల కోసం 'మీ సేవ'లో అప్లై చేయాలన్నారున. ఏదైనా సమస్య ఉంటే తహశీల్దార్ కార్యాలయంలో 7 రోజుల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటార న్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఏఈలు చిరంజీవి, భార్గవి, వర్క్ఇన్‌స్పెక్టర్ మారుతీ దివాకర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రథోత్సవానికి హాజరైన భక్తులు

లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరులో శుక్రవారం భక్తుల గోవింద నామస్మరణ మధ్య శ్రీభూనీలా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించడానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు అశేషంగా తరలివచ్చారు. రథం పైకి ధవనం, అరటి పండ్లు సమర్పించేందుకు భక్తులు పోటీపడ్డారు. భక్తులకు బలిజ సంఘం ఆధ్వర్యంలో, స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 1981-82లో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. బెంగళూరుకు చెందిన నరసింహారెడ్డి కుమారులు కేదేశ్వరరెడ్డి, ప్రమోదరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు లడ్డూ ప్రసాదం పంపిణీ చేశారు. రథోత్సవంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ మునీర్ అహ్మద్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రమాదపుటంచున విద్యుత్ స్తంభం

ధర్మవరం రూరల్ : ధర్మవరం నుంచి రేగాటిపల్లి వెళ్లే రహదారి వద్ద ఉన్న డిఎల్ఆర్ కాలనీ 29వ వార్డులో ఓ విద్యుత్ స్తంభం విరిగిపోయి ఏ క్షణాన కూలిపోతుందోనన్న పరిస్థితిలో ఉందని ఆ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి ముద్దుకృష్ణ తెలిపారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. స్తంభం కూలి ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరని ప్రశ్నించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

హిందూపురం: హిందూపురం-మలగూరు రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కీ మ్యాన్ శ్రీను నాయక్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎర్రి స్వామి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద లభించిన సెల్ ఫోన్, లగేజ్ బ్యాగ్, ఆధార్ కార్డు ఆధారంగా మృతుడు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మొరాదాబాద్, మొహల్లా చౌక్, బజార్ ఖాన్ కు చెందిన నిస్సార్ కుమారుడు ఇస్రార్ (35) గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. విషయాన్ని బంధువులకు సమాచారం అందించామన్నారు. మృతుడు పట్టణంలోని టీచర్స్ కాలనీలో సుధాకర్ నాయుడు నిర్వహిస్తున్న బ్యూటీ పార్లర్ లో పనిచేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE: PUTTAPARTHY
O.S. No:156/2021

Between:
Y.Ramachandra Reddy and others ...Plaintiffs
And
C.Venkata Reddy and others ...Defendants
పై నెంబరు దావాలోని 3వ ప్రతివాదికి దావా సమన్లు

To,
D3:Harbans Kour D/o Santhosh Singh, House No:1769, K.S.3 B2,SAS Nagar, Mohani Punjab-160069

ఇందుమూలకముగా మీకు తెలియచేయడం ఏమనగా పై నెంబరు దావాలోని వాదులు దావా షెడ్యూలు దాఖలా ఆస్తులు Declaration కు గాను పై దావా వేసినారు. సదరి విషయములై నీకు ఏమైనా ఆక్షేపణలున్న యెడల నీవు 21/03/2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు ఖుద్దున గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై నీ వాదనను కోర్టు వారికి తెలుపుకొనవలెను. లేని ఎడల నీ పరోక్షమందు పై దావాను తీర్మానము చేయుదురని యిందు మూలకముగా నీకు తెలియజేయడమైనది.

(By Order of the Court)
జి.మదన్ మోహన్ రెడ్డి,
వాదులపరం వకీలు, పెనుకొండ.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE: PUTTAPARTHY
O.S. No:152/2021

Between:
Parvathamma ...Plaintiff
And
C.Venkata Reddy and others ...Defendants
పై నెంబరు దావాలోని 2,3వ ప్రతివాదికి దావా సమన్లు

To,
D2:Chinnappagari Aswarthanarayana Reddy S/o Late Musal Reddy, Near Narasimha Swamy Temple, Byrapuram, Kothacheruvu Mandalam,
D3:Harbans Kour D/o Santhosh Singh, House No:1769, K.S.3 B2,SAS Nagar, Mohani Punjab-160069

ఇందుమూలకముగా మీకు తెలియచేయడం ఏమనగా పై నెంబరు దావాలోని వాదులు దావా షెడ్యూలు దాఖలా ఆస్తులు Declaration కు గాను పై దావా వేసినారు. సదరి విషయములై నీకు ఏమైనా ఆక్షేపణలున్న యెడల నీవు 26/03/2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు ఖుద్దున గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై నీ వాదనను కోర్టు వారికి తెలుపుకొనవలెను. లేని ఎడల నీ పరోక్షమందు పై దావాను తీర్మానము చేయుదురని యిందు మూలకముగా నీకు తెలియజేయడమైనది.

(By Order of the Court)
జి.మదన్ మోహన్ రెడ్డి,
వాదులపరం వకీలు, పెనుకొండ.

IN THE COURT OF THE HON'BLE DISTRICT JUDGE: ANANTHAPURAMU
E.P. No.774/2024 in .A.A. No. 687/2023

Between:
M/s Shriram Finance Ltd. Mudigubba Branch Rep.by its Authorized Signatory S.P.A.Holder C.Obaiah ...D.Hr
And
Mesha Ramakrishna and another ...J.Drs
J.Dr.1 & 2ప Order 21 Rule 37 CPC Notice

J.Dr No:1
RAMAKRISHNA MESHA, S/O,
M. SANJEEVA, D.NO. 3-143,
NAGALAGUBBALA (VILLAGE),
MUDIGUBBA (MANDAL), SRI SATYA SAI (DISTRICT),

J.Dr No:2
PEDDA NARAYANASWAMY.S, S/O,
ESWARAYYA S, D:NO 3-138A.
NAGALAGIBALA (VILLAGE),
MUDIGUBBA (MANDAL). SRI SATYA (DISTRICT),

పై పిటీషను బాకీ మొత్తమును రాబట్టు కొనుటకు గాను దాఖలు చేసిన E.P.లో J.Drs అయిన మీరు 18-03-2025వ తేదిన హాజరగుటకు గాను వాయిదా ఉన్నది.పై దినం ఉదయం 10:30 గం॥లకు పై కోర్టువారి ఎదుట ఖుద్దున గాని లేక వకీలు ద్వారా గాని హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
D.Malleswara Reddy, Advocate,
Ananthapuram. Cell:6304680318.

IN THE COURT OF THE ADDL.JUNIOR CIVIL JUDGE: DHARMAVARAMU
O.S. No. 252/2019

Between:
M.Venkata Naidu ...Plaintiff
And
T.Adikesavulu ...Defendent

Notice To Defendent

పై కేసులో వాది అయిన M.Venkata Naidu S/o Late Vengama Naidu, R/o Dampetla, Bathalapalli ప్రతివాది అయిన T.Adikesavulu S/o Kesenna, R/of Nasainganarayuni palli Village C.K.Palli Mandal పై పై కోర్టులో కేసు వేసి యున్నారు. పై కేసులో ప్రతివాది హాజరు నిమిత్తం 19/03/2025న ఉదయం 10:30 గంటలకు వాయిదా వున్నది. కావున ఆ రోజు నీవు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరు అయి నీ వాదనలు తెలుపుకో వచ్చును. ఆ రోజు అనగా 19/03/2025 న మీరు హాజరు కాని పక్షంలో నీ పరోక్షమున కేసు తీర్మానించబడును.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
A.Krishna Mohan,
K.Bhaskar,
B.Ravi,
Advocates Dharmavaram.